సాక్షి
అన్నమయ్య జిల్లా
మంగళవారం । 28 । మే । 2024



రమణీయం.. రథోత్సవం

జమ్మలమడుగులోని నారాపుర వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం భూదేవి, శ్రీదేవి సమేత నారాపుర వేంకటేశ్వర స్వామి రథోత్సవం నిర్వహించారు. - 8లో



తనయుడి కళ్లెదుటే తల్లి దుర్మరణం

ఎర్రగుంట్లలో రోడ్డు ప్రమాదం జరిగింది. బైకులో తల్లిని ఎక్కించుకుని కుమారుడు వెళుతుండగా లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో తల్లి షేక్ దిల్షాద్ (48) లారీ కింద పడి మృతి చెందింది. - 8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.360	రూ.480
రెండోరకం	రూ.260	రూ.350



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 560 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	515	515
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 137.740 కిలోలు

న్యూస్‌రీల్

బాడీబిల్డింగ్ నేషనల్ రెఫరీగా యూనుస్‌బాషా



కడప స్పోర్ట్స్ : కడప నగరానికి చెందిన ఎస్. యూనుస్‌బాషాకు ఆలిండియా బాడీబిల్డింగ్ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శిగా అవకాశం లభించింది. ఈనెల 26వ తేదీన తిరుపతిలో నిర్వహించిన గోల్డెన్ ఇండియా బాడీబిల్డింగ్ ఫెడరేషన్ జాతీయ సర్వసభ్య సమావేశం, ఎన్నికల్లో ఈయన్ను జాతీయ సంయుక్త కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బాడీబిల్డింగ్ నేషనల్ రెఫరీగా ఎంపికకావడంతో పాటు రెఫరీ గుర్తింపు కార్డును అయనుకు నిర్వాహకులు అందజేశారు. 2024 నుంచి 2028 వరకు ఈయన పదవిలో కొనసాగనున్నారు. ఈ సందర్భంగా యూనుస్‌బాషా మాట్లాడుతూ తనకు లభించిన ఈ అవకాశాన్ని బాడీబిల్డింగ్ క్రీడ అభివృద్ధికి వినియోగిస్తానన్నారు. ఏపీ బాడీబిల్డింగ్ అసోసియేషన్ చైర్మన్ ఇ.వై. కుమార్, అధ్యక్షుడు నూనె నగేష్, ఈసీ మెంబర్లు విజయ్‌కుమార్, ఉదయ్, రమణ, అచ్యుత్‌లు యూనుస్‌బాషాకు అభినందనలు తెలిపారు.

'స్కాలర్ జీపీఎస్' ఉత్తమ పరిశోధకుడుగా సుధాకర్‌రెడ్డి



వైవీయూ : కడపలోని ప్రభుత్వ పురుషుల కళాశాలలో భౌతికశాస్త్ర ఆచార్యులుగా పనిచేస్తున్న డాక్టర్ బుసిరెడ్డి సుధాకర్‌రెడ్డి కాలిఫోర్నియాకు చెందిన 'స్కాలర్ జీపీఎస్' సంస్థ అధ్యయనంలో ఉత్తమ పరిశోధకుడికిగా అవకాశం దక్కించుకున్నాడు. సంస్థ చేపట్టిన అధ్యయనంలో ప్రపంచవ్యాప్తంగా భౌతికశాస్త్ర విభాగంలో 9,75,791 మంది పరిశోధకుల్లో ఈయనకు 1,23,025వ స్థానం, టాప్ 12.61 శాతంలో చోటు దక్కింది. అదే విధంగా ఫాస్ఫోర్స్ సంస్థ పరిశోధనలో 33149 మంది పరిశోధకుల్లో 2271వ స్థానం టాప్ 6.85 శాతం మందిలో చోటు దక్కింది. కాగా డాక్టర్ బుసిరెడ్డి సుధాకర్‌రెడ్డి లూమినెసెంట్ మెటీరియల్స్‌పై పరిశోధన చేస్తున్నారు. ఎస్‌సీఐ పరిశోధన పత్రాలు, స్కోపస్, వెబ్ ఆఫ్ సైన్స్ హెచ్-ఇండెక్స్, ఐ10 ఇండెక్స్, గూగుల్ స్కాలర్ హెచ్-ఆర్కిడ్, డేటా బేస్ ఆధారంగా ఈ ర్యాంకులను ప్రకటించినట్లు ఆయన తెలిపారు.

శ్రీ భద్రకాళీ సమేతుడికి పల్లకి సేవ



పల్లకిలో ఊరేగుతున్న శ్రీ భద్రకాళీ సమేతుడు

రాయచోటి టౌన్ : రాయచోటి శ్రీ భద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామి పల్లకిలో ఊరేగారు. సోమవారం రాత్రి మూల విరాట్ స్వామి, అమ్మవార్లకు అభిషేకాలు, పూజలు నిర్వహించి రంగు రంగుల పూలు, పట్టు వస్త్రాలు, బంగారు ఆభరణాలతో అలంకరించి భక్తుల దర్శన ఏర్పాటు చేశారు. అలాగే ఉత్సవ మూర్తులకు అభిషేకాలు పూజలు నిర్వహించి అందంగా అలంకరించిన పల్లకిలో ఉంచి ఆలయ మాఢవీధులలో, ఆలయ ప్రాంగణంలో ఊరేగించారు. ఈ పూజలు ఆలయ పాలక మండలి అధ్యక్షురాలు పోలంరెడ్డి విజయ, ఆలయ ఈవో డీవీ రమణారెడ్డి ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు శంకర స్వామి, కృష్ణస్వామిల ఆధ్వర్యంలో నిర్వహించారు.

నేడు శిక్షణ

రాయచోటి: జిల్లా, డివిజన్ స్థాయిలలో ఎన్కోర్, ఐటీ అప్లికేషన్, ఈటీపీబీఎస్ టీమ్‌లకు ఈనెల 28న ఎన్నికల కౌంటింగ్‌పై శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ పేర్కొన్నారు. 28న ఉదయం 10 గంటలకు ఈఎస్‌సీఓఆర్ఈ అండ్ సీఈఓ వెబ్ సైట్‌లో పట్టిక, డేటా ఎంట్రీ పట్టికపై ఐటీ బృందానికి శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. అలాగే ఈటీపీబీఎస్ జట్లకు మధ్యాహ్నం 2 గంటలకు శిక్షణా ఉంటుందని వివరించారు. రాయచోటి కలెక్టరేట్‌లోని స్పందన సమావేశ మందిరంలో నిర్వహించే ఈ శిక్షణా కార్యక్రమానికి టీమ్ సభ్యులందరూ శిక్షణకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆయా నియోజకవర్గ రిటర్నింగ్ అధికారులను ఆదేశించారు,

డివిజన్ స్థాయిలో.... ఈవీఎం, పోస్టల్ బ్యాలెట్ అంశాలలో...కౌంటింగ్ సూపర్‌వైజర్లు, కౌంటింగ్ అసిస్టెంట్‌లకు శిక్షణా కార్యక్రమం ఉంటుందని.. వీటిని మదనపల్లెలో జిల్లాపరిషత్ హైస్కూల్‌లో మదనపల్లె, తంబళ్లపల్లె నియోజకవర్గాల వారికి శిక్షణ ఇస్తారు. రాయచోటిలోని పీసీఆర్ కల్యాణ మండపంలో రాయచోటి, పీలేరు నియోజకవర్గాల వారికి, రాజంపేట సబ్ కలెక్టర్ కార్యాలయం సభా భవనంలో రాజంపేట, కోడూరు నియోజకవర్గాల వారికి శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు.


పార్లమెంటు నియోజకవర్గం : రాజంపేట

మొత్తం ఓటర్లు 16,65,702

నియోజకవర్గాలు 7

అన్నమయ్య జిల్లా 6

చిత్తూరుజిల్లా 1





నిర్ణేత ఆమే!

- ఏడు సెగ్మెంట్లలో మహిళల ఓటింగ్ అధికం
- అభ్యర్థుల తలరాత ఆమె చేతిలోనే
- స్వచ్ఛందంగా పీఎస్‌కు తరలివచ్చిన మహిళలు
- మహిళా సంక్షేమ పథకాలతోనేనని విశ్లేషకుల అభిప్రాయం
- ఎస్‌బీఐ రీసెర్చ్ నివేదిక స్పష్టం

మొత్తం ఓట్లు 16,65,702

పోలైన ఓట్లు 12,96,714

పోలైన పురుషుల ఓట్లు 6,33,562

పోలైన మహిళ ఓట్లు 6,63,293

నియోజకవర్గాలవారీగా..

నియోజకవర్గం	పీఎస్	మొత్తం ఓటర్లు	మహిళ ఓటింగ్	నమోదు శాతం
తంబళ్లపల్లె	236	224802	93920	83.14
పీలేరు	281	234608	87478	72.21
మదనపల్లె	259	266590	101755	75.11
రాజంపేట	287	241200	95752	76.05
పుంగనూరు	262	238868	104717	86.62
కోడూరు	252	204466	78639	74.51
రాయచోటి	292	255168	1010132	77.39

రాజంపేట: రాజంపేట లోక్‌సభ పరిధిలో జరిగిన ఓటింగ్‌లో మహిళల ఓట్లే కీలకంగా మారనున్నాయి. అరుదశాబ్దాల తర్వాత రాజంపేట లోక్ సభ ఎన్నికల బరిలో ఒకే సామాజికవర్గం వారు పోటీలో నిలిచారు. ఈ నేపథ్యంలో ఎన్నడూలేని రీతిలో ఈ సార్వత్రిక ఎన్నికల్లో మహిళల ఓటింగ్ భారీగా నమోదైంది. బరిలోకి దిగిన ప్రధానపార్టీల అభ్యర్థుల భవితవ్యం ఇప్పుడు ఆమె చేతిలో ఉంది. ఆమె ఓటు ఎటు మొగ్గిందో.. ఆ పార్టీకే విజయం తూగుతుంది. రాజంపేట పార్లమెంట్ పరిధిలో ఆరు నియోజకవర్గాలు ఉన్నాయి. ఇందులో ఒక నియోజకవర్గం చిత్తూరు జిల్లా పరిధిలో ఉంది. రాజంపేట పార్లమెంటు పరిధిలో 16,39,605 మంది ఓటర్లు ఉన్నారు.

వైఎస్సార్‌సీపీ వైపే మొగ్గు...

మహిళల ఓట్లు ఎక్కువగా నమోదయ్యాయంటే సహజంగానే వైఎస్సార్‌సీపీకి మొగ్గు ఉంటుందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్లపాలనలో మహిళలకోసం అనేక పథకాలను అమలుచేయడమే కాకుండా వారి జీవనోపాధిని మెరుగుపరచడమే కారణమని వారు విశ్లేషిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళల పేరిట పథకాలు మంజూరు చేయడంతో మహిళా ఓటింగ్ పెరిగిందని ఎస్‌బీఐ రీసెర్చ్ నివేదిక స్పష్టం చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని మహిళలందరూ మళ్లీ వైఎస్ జగన్‌ను ముఖ్యమంత్రి చేయాలని గట్టి పట్టుదలతో పోలింగ్ కేంద్రాలకు వచ్చి ఓటు వేశారని సీనియర్‌రాజకీయ నాయకులు వ్యాఖ్యానిస్తున్నారు. మహిళల ఓటు ఎక్కువగా నమోదు అయిన నేపథ్యంలో పార్లమెంటు పరిధిలోని ఏడు అసెంబ్లీ స్థానాలలో మహిళల ఓట్లన్నీ వైఎస్సార్‌సీపీకే పడ్డాయని, పోలింగ్ రోజు ఇది స్పష్టంగా కనిపించిందని పలువురు బహిరంగగానే అభిప్రాయపడుతున్నారు.

హ్యాట్రిక్ దిశగా సిట్టింగ్ ఎంపీ పీవీ మిథున్‌రెడ్డి



2009 ఎన్నికల్లో బలిజ సామాజికవర్గానికి చెందిన ఆదికేశవుల నాయుడు సతీమణి సత్యప్రభతో పీవీ మిథున్‌రెడ్డి తలబడి గెలుపొందారు. 2014లో బీజేపీ అభ్యర్థిగా పోటీచేసిన ప్రస్తుత బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరిపై పీవీ మిథున్‌రెడ్డి అత్యధికమెజార్టీతో గెలుపొందారు. ఇక తాజా ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి, మాజీ సీఎం నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డితో తలపడ్డారు. ఈ ఎన్నికల్లో హ్యాట్రిక్ కోసం సిట్టింగ్ ఎంపీ ఎదురుచూస్తున్నారు. మూడవసారి కూడా మిథున్‌రెడ్డిదే విజయం ఖాయమని ఆ పార్టీ వర్గాలు బలంగా విశ్వసిస్తున్నాయి. మహిళ ఓటింగ్ వైఎస్సార్‌సీపీ వైపు మొగ్గు చూపడంతో మిథున్ రెడ్డి గెలుపు ఖాయమని రాజకీయవిశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

వైఎస్సార్‌సీపీ వైపే మహిళా ఓటర్ల మొగ్గు



ఏడు అసెంబ్లీ స్థానాలలో 6,63,293 మంది మహిళల ఓట్లు 90శాతం వైఎస్సార్‌సీపీకే పడ్డాయి.పోలింగ్‌రోజుల మహిళలు భారీగా తరలిరావడమే ఇందుకు నిదర్శనంగా భావిస్తున్నాం. మహిళలందరూ మళ్లీ వైఎస్ జగన్‌ను ముఖ్యమంత్రి చేయాలని గట్టి పట్టుదలతో పోలింగ్ కేంద్రాలకు స్వచ్ఛందగా ఉదయమే వచ్చి ఓటు వేయడం కనిపించింది. ఎంపీగా మిథున్‌రెడ్డి హ్యాట్రిక్ కొట్టబోతున్నారు. అలాగే ఏడు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలు అభ్యర్థులు గెలుస్తారు.

– మేడా రఘునాథరెడ్డి, రాజ్యసభసభ్యుడు

పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌కు అభినందన

వైవీయూ : ఆలిండియా అంతర్ విశ్వవిద్యాలయాల పవర్ లిఫ్టింగ్ పోటీల్లో చాంపియన్‌గా నిలిచిన వైవీయూ క్రీడాకారుడు మురళీకృష్ణను వైవీయూ అధికారులు అభినందించారు. సోమవారం విశ్వవిద్యాలయంలో వ్యాయామ విద్య, క్రీడాశాస్త్రశాఖ విభాగాధిపతి, వైవీయూ క్రీడాబోర్డు కార్యదర్శి డాక్టర్ కె. రామసుబ్బారెడ్డి ఆధ్వర్యంలో విజేతగా నిలిచిన క్రీడాకారుడు, కోచ్, మేనేజర్‌లు వైస్ చాన్సలర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వీసీ ఆచార్య చింతా సుధాకర్, రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్య, ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి క్రీడాకారున్ని, కోచ్, మేనేజర్‌లకు శాలువా కప్పి అభినందించారు. విశ్వవిద్యాలయం విద్యార్థి ఆలిండియా చాంపియన్‌గా నిలవడం మనందరికీ గర్వకారణమన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. వైవీయూ క్రీడాబోర్డు కార్యదర్శి డాక్టర్ కె. రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ ఈనెల 20 నుంచా 25వ తేదీ వరకు చెన్నైలోని తమిళనాడు స్పోర్ట్స్ యూనివర్సిటీలో నిర్వహించిన ఆలిండియా అంతర్ విశ్వవిద్యాలయాల పోటీల్లో వైవీయూ నుంచి ప్రాతినిత్యం వహించిన మురళీకృష్ణ 59 కేజీల విభాగంలో చాంపియన్‌గా నిలిచాడన్నారు. స్క్వాడ్ విభాగంలో 250 కేజీలు, బెంచ్‌ప్రెస్ విభాగంలో 130 కేజీలు, డెడ్‌లిఫ్ట్ విభాగంలో 240 కేజీలు చొప్పున మొత్తం 620 కేజీల బరువు ఎత్తి స్ట్రాంగ్‌మ్యాన్ ఆఫ్ ఆలిండియా యూనివర్సిటీ టైటిల్ కైవసం చేసుకున్నాడన్నారు. కార్యక్రమంలో ప్రొద్దుటూరు వైఎస్సార్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య నాగరాజు, పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య ఎస్. ఈశ్వరరెడ్డి, కోచ్ గణేష్, మేనేజర్ డొంకెన అనూష తదితరులు పాల్గొన్నారు.



మురళీకృష్ణను అభినందిస్తున్న వైవీయూ అధికారులు

ఇక ప్రైవేటుగా డ్రైవింగ్ లైసెన్స్‌లు

- కేంద్ర ఉపరితల రవాణా మంత్రిత్వశాఖ సన్నద్ధం
- ఆ సంస్థలు లైసెన్స్‌ల జారీకి అనుమతి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : ఇన్నాళ్లు డ్రైవింగ్ లైసెన్స్‌లు ప్రభుత్వ ఆధీనంలోని రవాణా శాఖ ద్వారా జారీ అవుతున్నాయి. ఇకపై వీటిని ప్రైవేటు సంస్థలు కూడా జారీ చేసే రోజులొస్తున్నాయి. ఇందుకు కేంద్ర ప్రభుత్వం మార్గం సుగమం చేస్తోంది. డ్రైవింగ్ లైసెన్స్‌ల జారీని ప్రైవేట్ సంస్థలకు కూడా ఇవ్వాలని గతేడాది నిర్ణయించింది. ఈ మేరకు నోటిఫికేషన్‌ను కూడా విడుదల చేసింది. ప్రైవేటు డ్రైవింగ్ సెంటర్ ఏర్పాటుకు అవసరమైన విధి విధానాలను రూపొందించింది. టూ వీలర్ డ్రైవింగ్ ట్రాక్‌కు కనీసం ఎకరం, ఫోర్‌వీలర్, అంతకు మించిన వాహనాల డ్రైవింగ్ ట్రాక్‌కు అయితే మూడెకరాల స్థలం ఉండాలని నిర్దేశించింది. అయితే నగరాలు, పట్టణాల్లో టెస్టింగ్ ట్రాక్ సెంటర్లు ఏర్పాటు చేయాలంటే భూముల ఖరీదు రూ. కోట్లలోఉండటం, తక్కువ ధరల్లో లభ్యం కాకపోవడం వల్ల అంతగా ఎవరూ ముందుకు రాలేదు. దీంతో అనుకున్న స్థాయిలో కార్యరూపం దాల్చలేదు. దీనిపై గత సంవత్సరం జిల్లా రవాణా శాఖ అధికారులు ఒక సమావేశాన్ని కూడా ఏర్పాటు చేశారు.ప్రైవేటు వ్యక్తులు/సంస్థలకు డ్రైవింగ్ లైసెన్స్‌ల జారీ తీరు తెన్నులను ఔత్సాహికులకు వివరించారు. అయినా ఇప్పటి వరకూ ఎవరూ దరఖాస్తు చేసుకోలేదు. ఈ నేపథ్యంలో నిబంధనలను కాస్త సరళతరం చేస్తూ ఈ ఏడాది జూన్ ఒకటో తేదీ నుంచి అమలు చేసేలా కేంద్ర ఉపరితల రవాణా మంత్రిత్వ శాఖ చర్యలు తీసుకుంటోంది. ప్రస్తుతం రవాణాశాఖ ఆధ్వర్యంలో ఉన్న ప్రభుత్వ ప్రాంతీయ రవాణా కార్యాలయాల(ఆర్టీవో)కు అదనంగా వీటిని ఏర్పాటు చేయనున్నారు. అనుమతి పొందిన ప్రైవేటు డ్రైవింగ్ టెస్ట్ సెంటర్ల నిర్వాహకులే టెస్ట్‌లను నిర్వహించి డ్రైవింగ్ లైస్సెన్‌లను జారీ చేస్తారు. ప్రస్తుతానికి ఈ సెంటర్లను జిల్లాకు ఒకటి చొప్పున మంజూరు చేసే అవకాశం ఉంది. ఈ టెస్టింగ్ సెంటర్లలో వీడియో కెమెరాలు, రికార్డింగ్ సదుపాయం కూడా ఉంటుంది. నిర్వాహకులు ఇష్టానుసారం డ్రైవింగ్ లైసెన్స్‌లను జారీ చేయకుండా సంబంధిత డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్(డీటీసీ).. ఆర్టీవోలు పర్యవేక్షించేలా వాటిని అనుసంధానం చేస్తారు.

ఏం కావాలంటే..

- టూ వీలర్ టెస్ట్ డ్రైవింగ్ ట్రాక్‌కు ఎకరా, ఫోర్ వీలర్ ట్రాక్ కోసం రెండెకరాల స్థలం అవసరం.
- ఈ సెంటర్‌లో డ్రైవింగ్ లైసెన్స్‌కు అవసరమైన సదుపాయాలు విధిగా సమకూర్చాలి.
- ట్రైనర్‌కు కనీసం హై స్కూలు, డిప్లొమా, ఐదేళ్ల డ్రైవింగ్ అనుభవంతో పాటు బయో మెట్రిక్, ఐటీపై అవగాహన ఉండాలి.
- లైట్ మోటార్ వెహికల్(ఎల్ఎంవీ) లైసెన్స్‌కు విధిగా నాలుగు వారాల్లో 29 గంటలు, ఎనిమిది గంటలు థియరీ, 21 గంటలు ప్రాక్టికల్‌పైన శిక్షణ ఇవ్వాలి.

శుభ్రతకూ ఓ పీరియడ్

- రుతుక్రమంపై కిశోర బాలికలకు అవగాహన
- నేడు నెలసరి పరిశుభ్రత యాజమాన్య దినోత్సవం

కిశోర బాలికల్లో శారీరకంగా, మానసికంగా అనేక మార్పులు సంభవిస్తాయి. ముఖ్యంగా రుతుక్రమం సమయంలో మానసికంగా ఆందోళనకు గురవుతుంటారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల నుంచి వారికి తగిన సలహాలు అందడం లేదు. అలాంటి వారిలో చైతన్యం తీసుకురావాలని ఫోర్డు సంస్థ నడుంబిగించింది. మంగళవారం నెలసరి పరిశుభ్రత యాజమాన్య దినోత్సవం నేపథ్యంలో ప్రత్యేక కథనం.

మదనపల్లె సిటీ : మదనపల్లె పట్టణంలోని పీపుల్స్ ఫర్ రూరల్ డెవలప్‌మెంట్ (ఫోర్డు) సంస్థ బాలికల అభివృద్ధి కోసం పని చేస్తోంది. చైల్డ్ రైట్స్ యు (క్రై) సంస్థ సహకారం అందిస్తున్నారు. విద్యార్థినులు పీరియడ్స్ సమయంలో పడే ఇబ్బందులను గుర్తించారు. ఈ మేరకు వారిలో అవగాహన కోసం నడుంబిగించారు. ఫోర్డు సంస్థలో పని చేసే రిసోర్సుపర్సన్లు ప్రభుత్వ పాఠశాలలతో పాటు గురుకుల, కస్తూరిబా,ప్రభుత్వ వసతిగృహాల్లో కిషోర బాలికల్లో కలిగే మార్పులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరిస్తోంది. ఇప్పటి వరకు సుమారు 15 వేల మంది విద్యార్థినులకు అవగాహన కల్పించారు. రుతుక్రమ శుభ్రతపై అవగాహన కల్పిస్తున్నారు. విద్యార్థినులను గ్రూపులుగా ఏర్పాటు చేసి వారికి అర్థమయ్యేలా వివరిస్తున్నారు. అలాగే అమ్మాయిలకు నాప్‌కిన్ ప్యాడ్స్ కూడా ఉచితంగా అందజేస్తున్నారు. అమ్మాయిల్లో పన్నేండేళ్ల తరువాత వచ్చే మార్పులు గురించి క్షుణ్ణంగా తెలియజేస్తున్నారు. పీరియడ్స్ సమయంలో బాలికలు శుభ్రత కోసం ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలనే దానిపై ప్రత్యేకంగా ఓ క్లాసు ఉంటే మంచిదని పలువురు అభిప్రాయపడుతున్నారు.



రుతుక్రమంపై విద్యార్థినులకు వివరిస్తున్న ఫోర్డు సభ్యులు

బాల్య వివాహాలు అడ్డుకుంటూ....

కోవిడ్ సమయంలో మదనపల్లె, తంబళ్లపల్లె నియోజకవర్గాల్లో బాల్య వివాహాలు ఎక్కువగా చోటు చేసుకున్నాయి. వీటిని గుర్తించి చాలా వరకు సిబ్బంది సహకారంతో అడ్డుకున్నారు. దీంతో పాటు అన్నమయ్య జిల్లాలోని 25 మండలాల్లో మరుగుదొడ్ల వినియోగంపై అవగాహన కల్పించారు. బాలల హక్కుల సదస్సుకు ఫోర్డు డైరెక్టర్ లలితమ్మ ఇటీవల అమెరికాలో జరిగిన సదస్సుకు హాజరయ్యారు. సదస్సుల్లో బాలికల సమస్యల గురించి వివరించారు. ముఖ్యంగా రుతుక్రమ సమయంలో బాలికలు పడే ఇబ్బందులు, అవగాహన కార్యక్రమాలను వివరించారు.

ఆరోగ్యం కోసం ..



మారుమూల ప్రాంతాల్లోని విద్యార్థినులకు రుతుక్రమ శుభ్రతపై అవగాహన లేదు. దీంతో ఇబ్బందులు పడుతున్నారు. వారు రుతుక్రమ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్యాడ్స్ గురించి అవగాహన కల్పిస్తున్నాం.

– జిల్లా లలితమ్మ, ఫోర్డు డైరెక్టర్, మదనపల్లె

కౌంటింగ్‌పై అవగాహన ఉండాలి

- పొరపాట్లకు తావులేకుండా ఓట్ల లెక్కింపు విజయవంతం చేయాలి
- మాక్ కౌంటింగ్ శిక్షణలో రిటర్నింగ్ అధికారులు, సిబ్బందికి కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిషోర్ ఆదేశం



కౌంటింగ్‌పై ఇస్తున్న శిక్షణలో ఆర్‌ఓలు, ఏఆర్‌ఓలు (ఇన్‌సెట్) కౌంటింగ్ శిక్షణలో మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి అభిషిక్త్ కిషోర్

రాయచోటి : కౌంటింగ్ ప్రక్రియలో క్షుణ్ణంగా అవగాహన ఉండాలని, అందులో పొరపాట్లకు తావులేకుండా ఓట్ల లెక్కింపును విజయవంతం చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎం.అభిషిక్త్ కిషోర్ రిటర్నింగ్ అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. సోమవారం రాయచోటి కలెక్టరేట్‌లోని స్పందన హాల్‌లో ఆర్‌ఓలు, ఏఆర్‌ఓలు కౌంటింగ్ సూపర్ వైజర్లు, సహాయకులు, మైక్రో అబ్జర్వర్లకు ఈవీఎం, పోస్టల్ బ్యాలెట్ ఎన్నికల ఓట్ల లెక్కింపుపై హాండ్స్ ఆన్ ట్రైనింగ్ (మాక్ కౌంటింగ్ శిక్షణ) కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియలో అత్యంత ముఖ్యమైన కౌంటింగ్ ప్రక్రియను పారదర్శకంగా ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలన్నారు. రాయచోటిలోని సాయి ఇంజనీరింగ్ కళాశాలలో జూన్ 4న జరిగే ఓట్ల లెక్కింపునకు రాజంపేట పార్లమెంట్, జిల్లాలోని ఆరు అసెంబ్లీ నియోజకవర్గాలకు మొత్తం 12 కౌంటింగ్ హాల్స్‌ను ఏర్పాటు చేశామన్నారు. ఇందులో ప్రతి కౌంటింగ్ హాల్‌లో 14 టేబుల్స్ ఏర్పాటు చేస్తారన్నారు. ఆయా నియోజకవర్గాలలో పోలైన ఓట్ల సంఖ్యను బట్టి 17 రౌండ్ల వరకు ఈవీఎం కౌంటింగ్ ఉంటుందన్నారు. అసెంబ్లీ నియోజకవర్గాల పోస్టల్ బ్యాలెట్ నిమిత్తం ఆయా నియోజకవర్గ కౌంటింగ్ హాలులో రెండు నుంచి నాలుగు టేబుల్స్ వరకు ఏర్పాటు చేస్తారని తెలిపారు. రాజంపేట పార్లమెంట్ పోస్టల్ బ్యాలెట్ నిమిత్తం విడిగా ఒక కౌంటింగ్ హాలులో 20 టేబుల్స్ ఏర్పాటు చేసి లెక్కిస్తారని వెల్లడించారు. పోస్టల్ బ్యాలెట్ లెక్కింపునకు ప్రతి టేబుల్‌కు ఒక ఏఆర్‌ఓ, ఒక సూపర్ వైజర్, ఇద్దరు అసిస్టెంట్లు, ఒక మైక్రో అబ్జర్వర్ ఉంటారన్నారు. ఈవీఎం కౌంటింగ్ నిమిత్తం ప్రతి టేబుల్‌కు ముగ్గురు సిబ్బంది ఉంటారన్నారు. ఇందులో ఒక కౌంటింగ్ సూపర్ వైజర్, ఒక అసిస్టెంట్, ఒక మైక్రో అబ్జర్వర్ ఉంటారన్నారు. ఈ మేరకు ఈవీఎంలలోని ఓట్ల కౌంటింగ్ నిమిత్తం అన్ని అసెంబ్లీ నియోజకవర్గాలకు 154 మంది సూపర్ వైజర్లు, 175 మంది కౌంటింగ్ అసిస్టెంట్లు, 138 మంది మైక్రో అబ్జర్వర్లను మొత్తం 467 మంది సిబ్బందిని నియమించారన్నారు. అలాగే పార్లమెంటుకు సంబంధించి 143 మంది సూపర్ వైజర్లు, 168 మంది కౌంటింగ్ అసిస్టెంట్లు, 140 మంది మైక్రో అబ్జర్వర్లు మొత్తం 451 మందిని నియమిస్తారని తెలిపారు. అసెంబ్లీ, పార్లమెంటుకు సంబంధించి రిజర్వుతో సహా 918 మంది సిబ్బందిని నియమించనున్నట్లు పేర్కొన్నారు. కౌంటింగ్ అధికారులు, సిబ్బంది అందరూ కౌంటింగ్ రోజు ఉదయం 5 గంటలకు తప్పనిసరిగా హాజరు కావాలన్నారు. తమకు కేటాయించిన నియోజకవర్గానికి సంబంధించి కౌంటింగ్ సెంటర్‌కు వెళ్లి రిటర్నింగ్ అధికారికి రిపోర్టు చేయాలన్నారు. కౌంటింగ్ ప్రక్రియకు సంబంధించి ఎన్నికల సంఘం జారీ చేసిన నియమ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు. శిక్షణ సమయంలో అన్ని అంశాలపై క్షుణ్ణంగా అవగాహన పెంచుకోవాలన్నారు. ఈనెల 29వ తేది నుంచి 31వ తేది వరకు మరోదఫా శిక్షణ ఇస్తారన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌ఓ సత్యనారాయణ రావు, ఆయా నియోజకవర్గ రిటర్నింగ్, సహాయ రిటర్నింగ్ అధికారులు, తహశీల్దార్లు వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సెమిస్టర్ పరీక్ష ఫలితాల విడుదల



పరీక్ష ఫలితాలను విడుదల చేస్తున్న వీసీ, రిజిస్ట్రార్ తదితరులు

వైవీయూ: యోగి వేమన విశ్వవిద్యాలయం పరిధిలోని ప్రొద్దుటూరు డాక్టర్ వైఎస్సార్ ఇంజినీరింగ్ కళాశాల బీటెక్, బీటెక్ (డిప్లమా) 4వ సంవత్సరం 8వ సెమిస్టర్ పరీక్ష ఫలితాలను విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్ విడుదల చేశారు. సోమవారం విశ్వవిద్యాలయంలోని తన చాంబర్ లో రిజిస్ట్రార్ ఆచార్య వైపీ వెంకటసుబ్బయ్య, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ ఆచార్య ఎన్. ఈశ్వర్ రెడ్డి, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య నాగరాజు, వైవీయూ ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డితో కలిసి పరీక్ష ఫలితాల గణాంకాలను పరిశీలించారు. గత నెలలో జరిగిన ఈ పరీక్షల ఫలితాలు త్వరితగతిన విడుదల చేసిన వైవీయూ పరీక్షల విభాగాన్ని వీసీ అభినందించారు. ఉత్తమ ఫలితాలు లభించిన సందర్భంగా వైవీయూ వైఎస్సార్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ అధ్యాపకులను, విద్యార్థులను ప్రశంసించారు.

తవళంలో కార్డెన్ సెర్చ్


గ్రామస్తులకు సూచనలిస్తున్న ఎస్‌ఐ లోకేష్ రెడ్డి

నిమ్మనపల్లె : మండలంలోని తవళం గ్రామంలో సోమవారం మదనపల్లి రూరల్ సర్కిల్ సీఐ సద్గురుడు ఆదేశాల మేరకు కేంద్ర సాయుధ బలగాలతో కలసి కార్డెన్ సెర్చ్ నిర్వహించినట్లు ఎస్ఐ లోకేష్ రెడ్డి తెలిపారు. తనిఖీలలో భాగంగా ప్రతి ఇంటిని క్షుణ్ణంగా పరిశీలించామన్నారు. వాహనాల రికార్డులను సైతం తనిఖీ చేశామన్నారు. అనంతరం గ్రామస్తులతో సమావేశం ఏర్పాటు చేసి కౌంటింగ్ పూర్తయ్యేంతవరకు పాటించాల్సిన ఎన్నికల నిబంధనలపై అవగాహన కల్పించినట్లు చెప్పారు. జూన్ 4వ తేదీ వరకు మండలంలో 144 సెక్షన్ 30 యాక్ట్ అమల్లో ఉంటుందన్నారు. ఎన్నికల ఫలితాల సందర్భంగా టపాసులు కాల్చడం, ర్యాలీలు నిర్వహించడం నిషిద్ధమన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఐ జిలానిబాషా, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి హామీ కార్యాలయంలో

ఏం జరుగుతోంది?

ఒక్కసారిగా కూలీల సంఖ్య పెంపుపై అనుమానాలెన్నో..

పెద్దతిప్పసముద్రం : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కార్యాలయంలో ఏం జరుగుతోందనే విషయం మండలంలో చర్చనీయాంశంగా మారింది. మూడు నెలల ముందు వరకు అతి తక్కువగా ఉన్న కూలీల సంఖ్య ఒక్కసారిగా పెరిగి పోవడంపై ప్రజా ప్రతినిధుల్లో సైతం పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మండలంలో ఉపాధి హామీ పథకం ద్వారా ప్రస్తుతం ఫారంపాండ్, ఛానల్ పనులు, పూడికతీత, రైతుల పొలాల్లో కందకాల పనులు జరుగుతున్నాయని అధికారులు పేర్కొంటున్నారు. అయితే ఈ ఏడాది మార్చి నెలలో 7,562 పని దినాలు కల్పించగా ఏప్రిల్ నెలలో 20,303, మే నెల పూర్తి కాకున్నా ఇప్పటి వరకు అత్యధికంగా 29,319 పని దినాలు కల్పించడంతో పలువురు ముక్కున వేలేసుకుంటున్నారు. అసలే ఖరీఫ్ సీజన్ కావడం కూలీలు వ్యవసాయ పనుల్లో నిమగ్నమై ఉంటున్న సమయంలో ఒక్కసారిగా 20 వేల పని దినాలు పెరగడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అంతేగాక మండలంలో జరుగుతున్న ఉపాధి పనులను క్షేత్ర స్థాయిలో పర్యవేక్షించాల్సిన మండల స్థాయి అధికారులు ఎన్నికల విధుల్లో బిజీ కావడంతో పలువురు క్షేత్ర, సాంకేతిక సహాయకులు ఇష్టారాజ్యంగా చేతివాటం ప్రదర్శించినట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఇదిలా ఉండగా ఖరీఫ్ సీజన్ కావడంతో ముందస్తుగా వర్షాలు భారీగా కురవడంతో వర్షపు నీరు సునాయాసంగా పారే ప్రదేశాల్లో పనులు చేస్తే వర్షాల అనంతరం నీటితో నిండుకుంటాయని భావించి ఇష్టారాజ్యంగా కూలీల పేర్లు రాస్తున్నారా, గతంలో పనులు పూర్తి చేసి ఆడిట్ అయిన పనులకే బిల్లులు పెట్టుకుంటున్నారా, బినామీల పేర్లను మస్టర్లలో నమోదు చేసి దొడ్డిదారిన బిల్లులు చేసుకుంటున్నారా అని ప్రజలు గుసగుసలాడుతున్నారు. కూలీల సంఖ్య అమాంతం పెరగడంపై సోమవారం ఎంపీడీఓ బ్రహ్మానందరెడ్డిని వివరణ కోరగా జిల్లా స్థాయి అధికారుల నుంచి తీవ్రమైన ఒత్తిడి రావడంతో కూలీల్లో చైతన్యం తెచ్చి పని దినాల సంఖ్యను పెంచామంటున్నారు. కనీసం డ్వామా ఉన్నతాధికారులు మండలంలో ఆకస్మికంగా తనిఖీ చేపట్టి ఈ రెండు నెలల వ్యవధిలో ఎక్కడెక్కడ ఎలాంటి పనులు చేపట్టారు, రికార్డుల ప్రకారం కూలీల చేతికి అందిన మొత్తం నగదు, మస్టర్లలో నమోదు చేసిన కూలీల సమగ్ర వివరాలను ఆరా తీసి మండల ప్రజల్లో వెల్లువెత్తుతున్న అనుమానాలను నివృత్తి చేయాల్సిన అవసరం ఉంది.



ఉపాధి హామీ కార్యాలయం

ఎస్సీ ఎస్టీ కేసుపై డీఎస్పీ విచారణ

ఓబులవారిపల్లె : మండలంలోని గాదెల వెంకటాపురం దళితవాడ గ్రామానికి చెందిన పోలంనేని పెంచలయ్య ఫిర్యాదు మేరకు నమోదైన ఎస్సీఎస్టీ కేసుపై సోమవారం రాజంపేట డీఎస్పీ చైతన్య విచారణ జరిపారు. ఫిర్యాది వాంగ్మూలం నమోదు చేశారు. ఇటీవల నిర్వహించిన సార్వత్రిక ఎన్నికల్లో గాదెల వెంకటాపురం ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన బూత్ నంబర్ 145లో పోలంనేని పెంచలయ్య వైఎస్సార్‌సీపీ తరపున ఏజెంట్‌గా కూర్చున్నాడు. ఓటు వేసేందుకు వచ్చిన తన బంధువులకు పెంచలయ్య సహకరించాడనే నెపంతో జనసేన పార్టీ నాయకులు గబ్బి వెంకటసుబ్బయ్య, పల్ల నారాయణ, ఎన్నార్ శివకుమార్ మరో ముగ్గురు పెంచలయ్యపై దాడి చేసి కులంపేరుతో దూషించారని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై ఈనెల 22వ తేదీన స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆరుగురిపై ఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేశారు. ఈమేరకు డీఎస్పీ విచారణ చేపట్టారు.

కుటుంబ సమస్యలతో యువకుడి ఆత్మహత్య

మదనపల్లె : కుటుంబ సమస్యలు, భార్యతో మనస్పర్థల కారణంగా ఓ యువకుడు ఇంట్లోనే ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఆదివారం రాత్రి మదనపల్లె పట్టణంలో జరిగింది.

నక్కలదిన్నె ప్రాంతానికి చెందిన ఇబ్రహీం, దిల్షాద్ దంపతుల కుమారుడు ఎస్. సద్దాం(28) స్థానికంగా బీరువాలు రిపేరు చేసే పని చేస్తూ జీవిస్తున్నాడు. అతనికి భార్య ఆషియా, ముగ్గురు పిల్లలు ఉన్నారు. భార్య తరచూ ఉపాధి కోసం కేరళకు వెళ్లి వస్తూ ఉండేది. ఈ కారణంగా వారి కుటుంబంలో సమస్యలు ఉత్పన్నమై భార్యాభర్తలు గొడవ పడేవారు. దీంతో సద్దాం మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో పది రోజుల క్రితం ఆషియా ఉపాధి కోసం కేరళకు వెళ్లింది. ఆదివారం పుంగనూరు సమీపంలోని కర్ణాటక సరిహద్దులో గల ఓ బార్‌కు వెళ్లిన సద్దాం అక్కడే పూటుగా మద్యం సేవించాడు. మద్యం మత్తులో ఇతరులతో గొడవపడ్డాడు. బంధువులకు ఫోన్ చేసి తనను ఇక్కడ కొట్టారని మీరు వెంటనే రావాలని కోరాడు. అతని కోసం వెళ్లిన బంధువులు సద్దాంను తీసుకుని తిరిగి వచ్చేందుకు ప్రయత్నించగా, తాను రానంటూ మొండికేశాడు. దీంతో అతని కోసం వెళ్లిన సోదరుడు తిరిగి వచ్చాడు. మళ్లీ మనసు మార్చుకున్న సద్దాం ఆదివారం రాత్రి ఇంటికి చేరుకున్నాడు. భార్యకు ఫోన్ చేసి తాను చనిపోతున్నానని చెప్పాడు. వినకుండా ఫోన్ స్విచ్ ఆఫ్ చేసి, తాను ఉంటున్న ఇంట్లోనే ఫ్యానుకు చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన స్థానికులు, కుటుంబ సభ్యులు బాధితుడిని వెంటనే స్థానిక ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన అత్యవసర విభాగం వైద్యులు అతను అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మార్చురీ గదికి తరలించారు. గత పది రోజులుగా భార్యతో గొడవ పడుతూ తరచూ తాను చనిపోతాను అంటూ బెదిరించేవాడని కుటుంబ సభ్యులు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్ టౌన్ సీఐ వలీబాషు తెలిపారు.

ప్రేమ పేరుతో నయవంచన

మలుపు తిరిగిన బాలిక అదృశ్యం కేసు

బి.కొత్తకోట : పేరు పేరుతో 13 ఏళ్ల బాలికను నమ్మించి వంచించిన వ్యక్తిపై అత్యాచారం, పోక్సో కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ సూర్యనారాయణ తెలిపారు. ఆయన కథనం మేరకు వివరాలు. బి.కొత్తకోట మండలానికి చెందిన బాలికను పెద్దతిప్పసముద్రం మండలానికి చెందిన వ్యక్తి ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని నమ్మించి ఈ నెల 4న వెంట తీసుకెళ్లాడు. ఇంటిలో కుమార్తె కనిపించకపోవడంతో తల్లి పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. దీనిపై దర్యాప్తు చేస్తుండగా ఆదివారం బాలిక తల్లితో కలిసి పోలీస్ స్టేషన్‌కు వచ్చింది. తనను ప్రేమ పేరుతో మోసం చేసిన విషయాన్ని సీఐకి వివరించింది. ఈనెల 4న బాలికను వెంట తీసుకెళ్లిన వ్యక్తి బెంగళూరు చేరుకుని అక్కడే ఉన్నారు. పెళ్లి చేసుకుంటానని నమ్మించి బాలికపై అత్యాచారానికి పాల్పడ్డాడు. మోసపోయినట్టు గ్రహించిన బాలిక అక్కడినుంచి తప్పించుకుని ఇంటికి చేరుకుంది. జరిగిన విషయం తల్లికి చెప్పడంతో వెలుగులోకి వచ్చింది. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. వైద్య పరీక్షల నిమిత్తం బాలికను జిల్లా ఆస్పత్రికి తరలించామన్నారు.

ఖరీఫ్‌లో ప్రతి రైతుకు విత్తన కాయలు పంపిణీ

జేడీ చంద్రానాయక్


రైతులు, సిబ్బంది సమావేశంలో మాట్లాడుతున్న జేడీ చంద్రానాయక్

లక్కిరెడ్డిపల్లి : ఈ ఖరీఫ్‌లో పంట సాగు చేసుకునే ప్రతి రైతుకు విత్తన కాయలు కచ్చితంగా పంపిణీ చేయాలని అగ్రికల్చర్ జేడీ చంద్రానాయక్ పేర్కొన్నారు. సోమవారం లక్కిరెడ్డిపల్లిలోని ఆర్‌బీకేలో వేరుశనగ విత్తనకాయలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలానికి 2190 క్వింటాళ్లు వేరుశనగ విత్తన కాయలు వచ్చాయన్నారు. అందులో నారాయణి రకం వేరుశనగ విత్తన కాయలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. పంట సాగుచేసుకునే రైతులు, పాసుపుస్తకం ఉన్న ప్రతి రైతుకు విత్తనకాయలు సక్రమంగా అందజేయాలని రైతు భరోసా కేంద్రం సిబ్బందికి సూచించారు. మండలానికి వచ్చిన వేరుశనగ విత్తన కాయల్లో 74 శాతం కన్నా తక్కువ నాణ్యత ఉంటే తిరిగి వెనక్కు పంపిస్తామన్నారు. అయితే ప్రస్తుతం వచ్చిన విత్తనకాయలు 80శాతం పైనే నాణ్యత కలిగి ఉన్నాయని పేర్కొన్నారు. రైతులు ఈ వేరుశనగ విత్తన కాయలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాగే ఎరువులు కూడా అందుబాటులో ఉన్నాయన్నారు. విత్తనకాయలు, ఎరువుల పంపిణీలో ఏవైనా అవకతవకలు జరిగితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏజీ జయరాణి, టెక్నికల్ ఏఓ రమేష్ రాజు, ఏఈఓ కేరోలిన్, రైతులు పాల్గొన్నారు.

బైక్ ఢీకొని వ్యక్తి దుర్మరణం


మృతి చెందిన శ్రీరాములు

బి.కొత్తకోట : ప్రైవేటు బస్సులను శుభ్రం చేస్తూ జీవిస్తున్న వ్యక్తిని వేగంగా వచ్చిన బైక్ ఢీకొని ప్రాణాలు తీసిన ఘటన ఆదివారం రాత్రి బి.కొత్తకోట సమీపంలోని అయ్యవారిపల్లె క్రాస్ వద్ద జరిగింది. పోలీసుల కథనం మేరకు వివరాలు. మండలంలోని గట్టు పంచాయతీ నల్లగుండ్లపల్లెకు చెందిన ఎ.శ్రీరాములు (45) ప్రైవేటు బస్సులను శుభ్రం చేసే వృతితో జీవిస్తున్నాడు. ఆదివారం రాత్రి అయ్యవారిపల్లె క్రాస్ వద్ద బి.కొత్తకోట వైపు నుంచి వేగంగా, నిర్లక్ష్యంగా దుసుకొచ్చిన బైకు శ్రీరాములును ఢీకొంది. ఈ ఘటనలో కిందపడిన శ్రీరాములు తలకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు వైద్యం కోసం 108లో స్థానిక సీహెచ్‌సీకి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్టు నిర్ధారించారు. మృతికి కారకుడైన కర్ణాటకలోని కూరిగేపల్లెకు చెందిన వీరాంజనేయులకు తీవ్ర గాయాలు కావడంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. మృతుని భార్య గంగాధరి ఫిర్యాదు మేరకు సోమవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బీరప్ప

పెద్దతిప్పసముద్రం : మండలంలోని రాపూరివాండ్లపల్లి పంచాయతీ నాగన్నకోట సమీపంలోని పటాలమ్మ గుడి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. వివరాలు ఇలా.. ఆదివారం రాత్రి బీరప్ప (36) అనే ద్విచక్ర వాహనదారుడు ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో ఆసుపత్రిలోనే చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు ఎస్ఐ రవీంద్రబాబు తెలిపారు. మృతుడు కర్ణాటక రాష్ట్రం రాయల్‌పాడ్ సమీపంలోని దోనూరు గ్రామానికి చెందిన వ్యక్తి అని తెలిసింది. కొన్నేళ్ల క్రితం బి.కొత్తకోటలో ఓ అద్దె ఇల్లు తీసుకుని భవన నిర్మాణ కార్మికుడిగా పని చేసేవాడు. ప్రమాద స్థలాన్ని పోలీసులు పరిశీలించి కేసు నమోదు చేశారు.

కాలువలో పడి వ్యక్తికి గాయాలు

మదనపల్లె : ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు కాలువలో పడి తీవ్రంగా గాయపడిన సంఘటన సోమవారం మదనపల్లి మండలంలో జరిగింది. సత్యసాయి జిల్లా నల్లచెరువుకు చెందిన రమణ(45), వ్యక్తిగత పనులపై మదనపల్లి మండలం పెంచుపాడుకు వచ్చాడు. తిరిగి స్వగ్రామానికి వెళ్లేందుకు స్థానికంగా ఉన్న బస్‌షెల్టర్ వద్ద కూర్చుని ఉండగా, ప్రమాదవశాత్తు పక్కనే ఉన్న కాలువలోకి జారి పడిపోయాడు. ప్రమాదంలో బాధితుడు తీవ్రంగా గాయపడగా గమనించిన స్థానికులు 108 వాహనం ద్వారా మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. స్థానికులు మొదట గుర్తు తెలియని వ్యక్తిగా భావించి 108 కు సమాచారం అందించారు. చికిత్స అనంతరం కోలుకున్న బాధితుడు తన వివరాలను చెప్పాడు.

నాటు తుపాకీ స్వాధీనం


నాటు తుపాకీతోపాటు పట్టుబడిన నిందితులు గిరి, వెంకటేష్

నిమ్మనపల్లె : అక్రమ సారా విక్రయాల కట్టడిలో భాగంగా జరిపిన తనిఖీలలో నాటు తుపాకీ స్వాధీనం చేసుకుని ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఎస్ఐ లోకేష్ రెడ్డి తెలిపారు. సోమవారం మండలంలోని నిమ్మనపల్లి పంచాయతీ గూడిపల్లి గ్రామంలో సారా విక్రయాలు జోరుగా జరుగుతున్నట్లు సమాచారం అందడంతో సిబ్బందితో కలిసి తనిఖీలు చేశామన్నారు. ఇందులో భాగంగా గ్రామ సమీపంలోని బసప్ప వరి పొలంలో జంతువుల వేటకు వినియోగించే నాటు తుపాకీని స్వాధీనం చేసుకున్నామన్నారు. స్థానిక యువకులు సికోళ్ల గిరి (23), గరివి వెంకటేష్(25)లను అరెస్టు చేశామన్నారు. నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో బాలుడి మృతి

వేంపల్లె : స్థానిక కడప రోడ్డులో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఊటుకూరు మనోజ్ (13) అనే బాలుడు మృతి చెందాడు. సోమవారం కారుకు నీటితో సర్వీసింగ్ చేస్తుండగా మోటార్‌పై ప్రమాదవశాత్తు నీరు పడి మనోజ్ విద్యుత్‌షాక్‌కు గురై మరణించాడు.

కారు, ద్విచక్ర వాహనం ఢీ

ఇద్దరు యువకుల మృతి


మృతి చెందిన యువకుడు

చిట్వేలి : మండల కేంద్రమైన చిట్వేలిలో అంబేడ్కర్ సర్కిల్ వద్ద కారు, ద్విచక్రవాహనం ఢీ కొన్న సంఘటనలో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఇద్దరు యువకులు మృతి చెందారు. చిట్వేలి ఎస్ఐ సుధాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. కోడూరు మండలం అనంతరాజుపేటకు చెందిన గడ్డం వంశీ, పెనగలూరు మండలం కట్టావారిపల్లి గ్రామానికి చెందిన ఎం.కార్తీక్‌లు రాపూరు వెళుతున్నారు. చిట్వేలి మండల కేంద్రంలోని రాపూరు మార్గంలో ఉన్న అంబేడ్కర్ సర్కిల్ వద్ద వంశీ, కార్తీక్‌లు వెళుతున్న ద్విచక్ర వాహనం పెంచల కోన నుంచి కోడూరుకు వెళ్తున్న కారును ఢీ కొంది. దీంతో ద్విచక్ర వాహనదారులకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి చికిత్స నిమిత్తం తరలించి, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షలు నిర్వహించిన వైద్యులు వారు మరణించినట్టు నిర్ధారించారు. ప్రమాదానికి సంబంధించి వివరాలు సేకరించి కేసు నమోదు చేస్తామని ఎస్ఐ తెలిపారు.

41 మద్యం బాటిళ్లు స్వాధీనం


స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లతో పోలీసులు

నందలూరు: మండలంలోని నల్లతిమ్మయ్యగారిపల్లి గ్రామంలో అక్రమంగా నిల్వ ఉంచిన 41 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ మహ్మద్ అబ్బుల్ జహీర్ తెలిపారు. నల్లతిమ్మాయపల్లె గ్రామంలో కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్‌లో భాగంగా ఓ గడ్డివాములో గుర్తు తెలియని వ్యక్తులు అక్రమంగా నిల్వ చేసిన 41 మద్యం బాటిళ్లను గుర్తించి స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుళ్లు పరమేశ్వర్, ధనుంజయరెడ్డి, కానిస్టేబుళ్లు రవి, వర్మ తదితరులు పాల్గొన్నారు.

తనయుడి కళ్లెదుటే తల్లి దుర్మరణం

ఎర్రగుంట్లలో ఘోర రోడ్డు ప్రమాదం


దిల్షాద్ (ఫైల్)


లారీ కింద పడి మృతి చెందిన దిల్షాద్

ఎర్రగుంట్ల : ఎర్రగుంట్ల పట్టణంలోని నాలుగు రోడ్ల కూడలి కడప రోడ్డులో సోమవారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. బైకులో తల్లిని ఎక్కించుకుని కుమారుడు వెళుతుండగా లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో తల్లి షేక్ దిల్షాద్ (48) లారీ కింద పడి మృతి చెందింది. తల భాగం విడిపోయి, శరీరమంతా నుజ్జునుజ్జు అయింది. ఈ సంఘటనను చూసిన వారంతా కన్నీరు మున్నీరుగా విలపించారు.

పోలీసులు తెలిపిన వివరాల మేరకు .. ఎర్రగుంట్ల పట్టణంలోని రాణీవనానికి చెందిన ఫక్రుద్దీన్, దిల్షాద్ దంపతులకు నలుగురు సంతానం. వీరిలో ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ఫక్రుద్దీన్ ప్రొద్దుటూరు ఆటో నగర్‌లో కూలి పనికి వెళుతూ జీవనం సాగిస్తున్నారు. కడపలో ఉండే దిల్షాద్ బంధువులు మృతి చెందిన విషయం తెలుసుకుని సోమవారం మధ్యాహ్నం కుమారుడు హనీఫ్‌తో కలిసి బైకుపై తల్లి దిల్షాద్ రాణీవనంలోని ఇంటి వద్ద నుంచి బయలుదేరింది. నాలుగు రోడ్ల కూడలి దాటి కడప రోడ్డులో కొంత దూరం వెళ్లగానే లారీ వచ్చి ఢీకొంది. ఈ ప్రమాదంలో లారీ టైర్ల కింద దిల్షాద్ పడి తలభాగం విడిపోయింది. శరీరమంతా నుజ్జునుజ్జు అయి అక్కడికక్కడే దుర్మరణం చెందింది. ఈ ప్రమాదం నుంచి హనీఫ్ త్రుటిలో తప్పించుకున్నాడు. తన కళ్లెదుటే తల్లి లారీ కింద పడి విగత జీవిగా మారడంతో కుమారుడు హనీఫ్ షాక్‌కు గురయ్యాడు. విషయం తెలుసుకున్న వెంటనే మృతురాలి భర్త ఫక్రుద్దీన్ సంఘటన స్థలానికి చేరుకుని బోరున విలపించాడు. ఎర్రగుంట్ల సీఐ ఈశ్వరయ్య సంఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతురాలి బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. ఈ సంఘటనతో ఎర్రగుంట్ల పట్టణంలోని రాణీవనంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

రమణీయం.. రథోత్సవం



రథోత్సవానికి భారీగా తరలి వచ్చిన భక్తులు

జమ్మలమడుగు నారాపుర వేంకటేశ్వరస్వామి రథోత్సవానికి తరలి వచ్చిన భక్తులు

జమ్మలమడుగు: జమ్మలమడుగులోని నారాపుర వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం భూదేవి, శ్రీదేవి సమేత నారాపుర వేంకటేశ్వరస్వామి రథోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు స్వామివారి రథాన్ని లాగేందుకు వేలాదిగా తరలి వచ్చారు. భక్తులు టెంకాయ, కర్పూరాలను సమర్పించి పూజలు చేశారు. ఉదయం నారాపుర వేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద నుంచి ప్రారంభమైన రథోత్సవం తేరురోడ్డు, పెద్దపసుపులమోటు, సంజామలమోటు మీదుగా పాతబస్టాండ్, మార్కెట్ వీధుల గుండా ఆంజనేయస్వామి ఆలయం వద్దకు వచ్చి మధ్యాహ్నం ఆగింది. అనంతరం మూడు గంటల తర్వాత స్వామి మెయిన్‌బజార్, కన్యకాపరమేశ్వరి ఆలయం, అంబాభవాని దేవాలయం మీదుగా పలగాడి వీధి నుంచి యథాస్థానికి చేరుకున్నాడు.


భూదేవి, శ్రీదేవి సమేత వేంకటేశ్వరస్వామి

అలరించిన భక్తుల ప్రదర్శనలు..

స్వామి వారి రథం ముందు భక్తులు కోలాట ప్రదర్శనలతోపాటు స్వామి వారి కీర్తనలు పాడుతూ నృత్యాలు చేసుకుంటూ పారవశ్యంలో మునిగిపోయారు. మరి కొంత మంది భక్తులు వేంకటేశ్వరస్వామి వేషధారణలో భక్తులకు కనువిందు చేయడంతో చాలామంది భక్తులు సెల్ఫీలు తీసుకున్నారు. భక్తులకు ఉచితంగా పానీయాలు, అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు.

• వైభవం.. చక్రస్నానం


కుందూనదిలో చక్రస్నానం చేస్తున్న చైర్మన్, అర్చకులు, భక్తులు

రాజుపాళెం : రాజుపాళెం మండలంలోని వెల్లాల పుణ్యక్షేత్రంలో శ్రీచెన్నకేశవ, సంజీవరాయ, భీమలింగేశ్వర స్వాముల బ్రహ్మోత్సవాలలో భాగంగా తొమ్మిదో రోజు సోమవారం హంస వాహనం (వసంతోత్సవం) అత్యంత వైభవంగా నిర్వహించారు. కార్యక్రమం ఆలయ చైర్మన్ బుక్కసముద్రం జగదీశ్వర రెడ్డి, ఈఓ నరసయ్య ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరిగాయి. ఉదయాన్నే ఉత్సవ విగ్రహాలైన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీచెన్నకేశవ, సంజీవరాయ స్వాముల విగ్రహాలను హంస వాహనంపై ఆశీనులు చేసి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం రంగుల నీళ్లు చల్లుకుంటూ పర్లపాడు గ్రామ భజన సంఘం సభ్యులు భజన పాటలు పాడుకుంటూ నేరుగా నవధాన్యాల మొలక తీసుకొని కుందూనది వద్ద ప్రత్యేక పూజలు చేశారు. తర్వాత కుందూ నదిలోని నీరు తెచ్చి ఉత్సవ విగ్రహాలకు చక్రస్నానం చేయించారు. అక్కడకు వచ్చిన భక్తులంతా కుందూనదిలో చక్రస్నానం ఆచరించారు. భక్తులకు సంజీవరాయ అన్నదాన సత్రంలో అన్నదానం ఏర్పాటు చేశారు. జెడ్పీటీసీ సభ్యురాలు జీరెడ్డి అంజనీకుమారి, ఎంపీటీసీ సభ్యురాలు బి.ప్రవల్లిక, దేవస్థానాల మాజీ చైర్మన్‌లు పట్టాభి సీతారామిరెడ్డి, సర్పంచ్ గోవర్ధన్ రెడ్డి, జనార్ధన్ రెడ్డి, బాలనాగిరెడ్డి, వెంకటపతిరెడ్డి, భాస్కర్ రెడ్డి, ఉభయదారులు, కమిటీ సభ్యులు, సీనియర్ అసిస్టెంట్ రామ మోహన్, అర్చకులు పాల్గొన్నారు.